సాక్షి
నాగర్‌కర్నూల్

శుక్రవారం । 12 । జూలై । 2024



ధన్వంతరి హోమాలు

విశ్వశాంతి మహాయాగంలో భాగంగా ధన్వంతరి హోమాలు నిర్వహించారు.

వివరాలు 8లో ▸



లోకాయుక్త విచారణ

జడ్చర్లలో భూముల అన్యాక్రాంతంపై లోకాయుక్త బృందం విచారణ చేపట్టింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /24.2

రోజులో ఎక్కువ శాతం ఆకాశం మేఘావృతం అవుతుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్య వృత్తిపైనే మమకారం ఎక్కువ



బిజినేపల్లి: ఎమ్మెల్యే పదవి కంటే తనకు వైద్య వృత్తి అంటేనే ఇష్టమని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పాలెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో జిల్లా ఆర్టీసీ ఉద్యోగులకు ఆరోగ్య సేవలు అందించేందుకు వైద్యశాల ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వైద్య రంగానికి కాస్త దూరమయ్యాయనని, కానీ, ఎప్పుడు ఎవరికి ఎలాంటి సేవలు అవసరం ఉన్నా 24 గంటలు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేసిన వైద్యశాలలో ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్టీసీ కార్మికులకు దంత వైద్య అవసరాలు ఉంటే వారికి ఉచితంగా వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎం శ్రీదేవి, డీఎం దేవరాజు, డాక్టర్ శైలజ, కాంగ్రెస్ నాయకులు వెంకటస్వామి, తిరుపతయ్య, అమృతరెడ్డి, రాములు, నసీర్, వాల్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పాలెం డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు



బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిందని ప్రిన్సిపల్ విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్ల పూర్తి చేసుకున్న పాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మూడు పర్యాయాలు న్యాక్ గ్రేడింగ్ సాధించిందని, యూజీసీ న్యూఢిల్లీ, రాష్ట్ర ఉన్నత విద్యా కమిషనర్ కార్యాలయాలకు పాలెం కళాశాల నుంచి తగిన సమాచారం అందించడంతో ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు పాలెం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు.

నేడు బస్సు సర్వీసులు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి డిపో పరిధిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లి నుంచి అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగు వరకు నూతన బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డితోపాటు ఆర్టీసీ జిల్లా అధికారులు శుక్రవారం ఉదయం 10 గంటలకు పాల్గొంటారు. అలాగే చారకొండ మండలంలోని మరో బస్సు సర్వీసును గోకారం, చంద్రాయన్‌పల్లి మీదుగా ప్రారంభిస్తామని, ప్రజలు బస్సు సర్వీసులను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.



బల్మూరు మండలం కొండనాగులలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహ భవనం. శిథిలావస్థకు చేరుకున్న పురాతన భవనంలోనే హాస్టల్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే హాస్టల్ గదుల్లోని పైకప్పు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ హాస్టల్‌లో 60 మంది విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి వస్తోంది. హాస్టల్ గదులు చాలా వరకు శిథిలావస్థకు చేరడంతో అధికారులు గ్రామంలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని అందులో ఉంచుతున్నారు. ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమవుతూ నూతన భవన నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు.



బల్మూరులోని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్‌లోని టాయిలెట్ల పరిస్థితి ఇది. రూ.లక్షలు వెచ్చించి కొత్తగా నిర్మించిన టాయిలెట్ గదులకు కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. తలుపులు అమర్చక, వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ఏళ్లుగా ఇలా నిరుపయోగంగా మారాయి. ఈ హాస్టల్‌లో మొత్తం 80 మంది విద్యార్థినులు అరకొరగా ఉన్న పాత టాయిలెట్లతోనే సర్దుకోవాల్సి వస్తోంది. బాలికల హాస్టల్ చుట్టూ కనీసం ప్రహరీ కూడా నిర్మించలేదు. టాయిలెట్లకు నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని, రక్షణ కోసం కంపౌండ్ వాల్ నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

హాస్టళ్లు శిథిలం.. వసతి దుర్భరం



శిథిలావస్థకు చేరిన బల్మూరు మండలం కొండనాగులలోని బాలుర బీసీ హాస్టల్

పెచ్చులూడుతున్న గదుల్లో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు

- అధ్వానంగా మూత్రశాలలు, వంట గదులు
- ఏళ్లుగా నూతన భవనాలకు నోచుకోని వైనం
- ప్రతిపాదనలతోనే సరిపెడుతున్న అధికారులు
- 'సాక్షి' విజిట్‌లో వెలుగులోకి అధ్వాన పరిస్థితులు

సాక్షి విజిట్

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. సుమారు మూడు, నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన పాత భవనాల్లోనే ఇప్పటికీ విద్యార్థుల వసతి గృహాలను నిర్వహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. శిథిలావస్థలో ఉన్న పైకప్పు పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయోనని విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎక్కడా టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా కనిపించడం లేదు. చాలా వరకు హాస్టళ్లలో డోర్లు, నీటి సౌకర్యం లేని టాయిలెట్ గదులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. చాలాచోట్ల మరుగుదొడ్లు వసతులు లేక నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో స్థితిగతులపై 'సాక్షి' నిర్వహించిన విజిట్‌లో ఎన్నో సమస్యలు వెలుగుచూశాయి.

మురికి కూపాలుగా మూత్రశాలలు

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో చాలా వరకు టాయిలెట్ల నిర్వహణ కనిపించడం లేదు. కొన్నిచోట్ల కనీసం నీటి సౌకర్యం కూడా లేదు. తలుపులు లేక, శుభ్రం చేయకపోవడంతో చాలాచోట్ల వినియోగంలోకి రావడం లేదు. టాయిలెట్లను నెలల తరబడి శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. పాతకాలం నాటి వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రైవేట్ ఇళ్లను అద్దెకు తీసుకుని హాస్టల్ నిర్వహిస్తున్నారు. అయితే ప్రైవేటు ఇళ్లలో విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో ఫ్యాన్లు, లైట్లు, మంచాలు లేక విద్యార్థులు నేలపైనే పడుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు కూడా ఇవ్వకపోవడంతో ఇంటి నుంచే అన్నీ సమకూర్చుకుంటున్నారు.



అమ్రాబాద్‌లోని ఎస్సీ బాలుర హాస్టల్‌లోని టాయిలెట్ గదుల దుస్థితి ఇది. తలుపులు లేని స్నానాల గదులు, శుభ్రత లేని మూత్రశాలలతో విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్‌లోని బోరు నిరుపయోగంగా మారడంతో అన్నింటికీ మిషన్ భగీరథ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. స్నానాలకు, టాయిలెట్ల వినియోగానికి నీరు సరిపోక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం..

జిల్లాలోని పలు హాస్టళ్లు శిథిలావస్థలో ఉన్నట్టు గుర్తించాం. పాత భవనాల నుంచి విద్యార్థులను పక్కా భవనాల్లో మార్చేలా ఏర్పాట్లు చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో హాస్టళ్లను సందర్శించి, త్వరలోనే విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– ఖాజా నజీం అలీ, బీసీ సంక్షేమ శాఖాధికారి

పర్యవేక్షణ కరువు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, మరమ్మతు, నూతన భవన నిర్మాణాలకు ఏళ్లుగా నిధులు లేక నిర్వహణ కొరవడింది. టాయిలెట్లు, వంట, స్నానాల గదులు మరమ్మతుకు కూడా నిధులు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. అలాగే హాస్టళ్లపై క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువైంది. దీంతో పట్టించుకునేవారు లేక హాస్టళ్లలో విద్యార్థుల పరిస్థితి దుర్భరంగా మారింది. బీసీ హాస్టళ్లలో రెండేళ్ల కిందట చేపట్టిన పనులకు ఇప్పటి వరకు బిల్లులు రావడం లేదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పాఠశాలల పర్యవేక్షణ ఆయా విభాగాల ఆర్సీఓలు నిర్వర్తిస్తుండగా, హాస్టళ్ల నిర్వహణ మాత్రం ఆయా శాఖల సంక్షేమ అధికారుల చేతుల్లో ఉంది. హాస్టళ్ల నిర్వహణకు నిధులు లేవంటూ అధికారులు చేతులు దులుపుకోవడం, కనీస పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు.

రైతు భరోసా.. ఎలా ఇద్దాం?



ఏర్పాట్లపై కలెక్టర్ సంచిత్, ఎస్పీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

నేడు వనపర్తికి కేబినెట్ సబ్ కమిటీ

- ఉమ్మడి జిల్లా రైతులతో అభిప్రాయ సేకరణ
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐదుగురు మంత్రులు
- కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో భారీ ఏర్పాట్లు

వనపర్తి: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లోని ముఖ్యమైన రైతు భరోసా అమలుపై తుది నిర్ణయం తీసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం పాలమూరు రైతులతో అభిప్రాయ సేకరణ చేయనుంది. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల నుంచి జిల్లాకు 50 మంది చొప్పున సమకాలిన అంశాలపై సంపూర్ణ అవగాహన కలిగిన రైతులను ఎంపిక చేసి వనపర్తి వేదికగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించనున్నట్లు తెలుస్తోంది. రైతు సంఘం నాయకులు, న్యాయవాద, డాక్టర్ వృత్తిలో ఉంటూనే వ్యవసాయం చేసే రైతులను రప్పించేందుకు డీఏఓలకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు అందించారు. ఇప్పటికే ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన ఈ వర్క్‌షాప్ మూడోరోజు ఉమ్మడి పాలమూరుకు సంబంధించి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభ్యర్థన మేరకు వనపర్తిలో నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సేకరించిన రైతుల అభిప్రాయాల ప్రకారం.. పదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా పథకంలో ఏటా ఎకరాకు రూ.15 వేల చొప్పున అందించాలనే అభిప్రాయాలు ఎక్కువగా వస్తుండటం గమనార్హం. అయితే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పది ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుల పదిశాతం అంతకంటే తక్కువే ఉన్నట్లు వ్యవసాయ అధికారులు లెక్కలు తీసి నివేదికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పెట్టుబడి సాయం అందించాలనే ప్రస్తుత పాలకుల ఆలోచనల మేరకు జిల్లా వారీగా సాగుచేస్తున్న వ్యవసాయ భూములు, పండిస్తున్న పంటల వివరాలు, గత ప్రభుత్వంలో చివరిసారిగా యాసంగిలో జిల్లాల వారిగా రైతుల వివరాలతో ఆయా జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కేబినెట్ సబ్ కమిటీ వర్క్‌షాప్ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

90 శాతం పదెకరాల్లోపు వారే

ఉమ్మడి జిల్లాలోని మొత్తం రైతుల్లో పదెకరాల్లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులు 90 శాతం పైబడి ఉన్నట్లు తాజా వ్యవసాయశాఖ అధికారుల లెక్కలతో స్పష్టమవుతోంది. ఇక వ్యవసాయం చేసే వారికే ఇవ్వాలా.. భూమి ఉంటే చాలు రైతు భరోసా ఇవ్వాలనే అనే అంశంతో పాటు కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఎలా అందించాలి.. ఉద్యాన పంటలు సాగుచేసే రైతులు, కొత్తగా వ్యవసాయ భూమి తీసుకున్న వారు.. కొండలు, గుట్టలుగా భూమి రైతులు, ప్రభుత్వం ఉద్యోగం చేస్తూ.. వ్యవసాయ చేసేవారు, ఐటీ చెల్లించే రైతులు, న్యాయవాదులు, వైద్య వృత్తిలో ఉంటూ.. వ్యవసాయం చేసుకునే వారి విషయమై రైతులతో సుదీర్ఘంగా చర్చించే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు, రైతుల అభిప్రాయాలను సేకరించి రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ రైతుల అభిప్రాయాలను క్రోడీకరించి నిర్ణయం పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ఇది వరకే ఉపముఖ్యమంత్రి వెల్లడించడంతో రైతులు తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

మంత్రుల బృందం పర్యటనకు సంబంధించి గురువారం ఇన్‌చార్జి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, గద్వాల ఎస్పీ శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెలీప్యాడ్, కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ఏర్పాట్లను పరిశీలించారు. ఐదు జిల్లాల నుంచి వచ్చే అధికారులు, రైతులకు ప్రజాప్రతినిధులకు, వీఐపీలకు కావాల్సిన సౌకర్యాలు, భోజన వసతి, ఇతర వసతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ట్రాఫిక్ రూట్లు, సమావేశానికి వచ్చే వాహనాల పార్కింగ్ అంశాలపై ఎస్పీ పోలీస్ అధికారులకు సూచనలు చేశారు.

వనపర్తి వేదికగా..

వనపర్తి కలెక్టరేట్ వేదికగా శుక్రవారం నిర్వహించనున్న కేబినెట్ సబ్ కమిటీ వర్క్‌షాప్ కార్యక్రమానికి రైతులతోపాటు ఆరుగురు మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావుతోపాటు ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు.

జిల్లా	మొత్తం రైతులు	గత యాసంగిలో రైతుబంధు తీసుకున్నవారు	పదెకరాల్లోపు భూమి ఉన్నవారు	అంతకంటే ఎక్కువ ఉన్న రైతులు
వనపర్తి	1,83,882	1,74,993	1,82,073	1,809
నాగర్‌కర్నూల్	3,22,728	3,06,000	3,18,610	4,118
గద్వాల	1,76,186	1,67,860	1,72,457	3,729
మహబూబ్‌నగర్	2,39,123	2,19,237	2,19,500	19,623
నారాయణపేట	1,85,878	1,76,747	1,82,992	2,886

ఇదేం వైఖరి..

- జిల్లాలో వివాదాస్పదంగా కొందరు పోలీసుల తీరు
- పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నా స్పందించని వైనం
- ఫిర్యాదుల స్వీకరణకు రోజుల తరబడి జాప్యం
- తాజాగా పోలీసుల తీరుపై మనస్తాపంతో మరో యువకుడి బలవన్మరణం

సాక్షి, నాగర్‌కర్నూల్/ బిజినేపల్లి: జిల్లాలోని పలువురు పోలీస్ అధికారుల తీరు విమర్శలకు దారి తీస్తోంది. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తున్నా స్పందించి కేసు నమోదు చేసేందుకు రోజుల తరబడి జాప్యం చేస్తున్నారు. ఇటీవల కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో చెంచు మహిళ ఈశ్వరమ్మపై జరిగిన దాడి విషయంలో నిందితులపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు వెనకాడటం వివాదాస్పదమైంది. తాజాగా ఓ కేసు విషయంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మనస్తాపంతో బిజినేపల్లి మండలం వెల్గొండకు చెందిన యువకుడు రాజు(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే తనపై జరిగిన దాడిపై అతని భార్య లక్ష్మి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని, ఇప్పటివరకు కేసు నమోదు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో బాధిత మహిళలు ధైర్యం చేసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా ఫిర్యాదు స్వీకరించడంలో, కేసు నమోదు చేయడంలో కొంతమంది పోలీస్ అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు.

ఆత్మహత్యలో మరో కోణం..

పెంపుడు కుక్కను కొట్టాడన్న కారణంతో ఇద్దరు అన్నదమ్ములు పరస్పరం దాడులకు పాల్పడే వరకు దారితీసింది. బిజినేపల్లి మండలం వెల్గొండకు చెందిన కుందేళ్ల రాజు ఈ నెల 7న తన పెంపుడు కుక్కపై దాడి చేశాడని తమ్ముడు బీరయ్యపై కర్రతో దాడి చేశాడు. ఆ సమయంలోనే రాజు భార్యపై బీరయ్య దాడిచేస్తూ ఆమె ముక్కును కొరికాడు. తనపై బీరయ్య దాడి చేశాడంటూ రాజు భార్య లక్ష్మి అదేరోజు రాత్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదు. బీరయ్య ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు రాజును రెండు రోజుల పాటు స్టేషన్‌కు పిలిచి విచారణ చేపట్టారు.



బిజినేపల్లి పోలీస్‌స్టేషన్

అయితే బీరయ్యపై ఇప్పటికే హత్యకేసుతోపాటు రౌడీషీటర్, పలువురిపై దాడి చేసిన కేసులు ఉండగా.. రాజకీయ పలుకుబడితో బీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మనస్తాపం చెంది రాజు ఈ నెల 10న ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, స్థానిక నేతలు చెప్పినట్టుగానే పోలీసులు నడుచుకున్నారని రాజు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాగా, ఘటనపై వచ్చిన రెండు ఫిర్యాదులను స్వీకరించి విచారణ చేపడుతున్నామని నాగర్‌కర్నూల్ డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. రాజు కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని, ఇందులో పోలీసుల ప్రమేయం లేదని వెల్లడించారు.

అమాయకుల పట్ల అమానుషం

ఈ ఘటనలో పోలీసులు మాజీ రౌడీషీటరు ఇచ్చిన ఫిర్యాదునే పరిగణలోకి తీసుకున్నారు కానీ, బాధిత మహిళ లక్ష్మి ఫిర్యాదు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తుంది. ఆమె ముఖంపై గాయం కనిపిస్తున్నా పోలీసులు మొదటి రోజే ఎందుకు కేసు నమోదు చేయలేదని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా రాజకీయ నాయకులు చెప్పిందే విని కేసులు ఎలా నమోదు చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. మాజీ రౌడీషీటరు అయిన బీరయ్య వెల్గొండకు చెందిన అధికార పార్టీ నాయకులతో చనువుగా ఉండటంతో వారు కూడా సహకరించినట్లు తెలుస్తోంది. ఈ మొత్తం ఘటనలో పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి ఉంటే ఒక అమాయకుడి ప్రాణం బలి కాకపోవడమే కాకుండా ఆ కుటుంబం రోడ్డున పడేది కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

విచారణ చేస్తున్నాం..

ఈ విషయమై ఎస్‌ఐ నాగశేఖరరెడ్డి స్పందిస్తూ బీరయ్య ఇచ్చిన పిటిషన్‌కు లక్ష్మి కౌంటర్ పిటిషన్ ఇచ్చిందని చెప్పారు. దీనిపై విచారణ చేస్తున్నామని, ఆ తర్వాత కేసు నమోదు చేస్తామన్నారు. పోలీస్ శాఖ నుంచి ఎలాంటి పక్షపాతం లేదు.

జనాభా పెరుగుదలకు అనుగుణంగా మార్పులు



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: జనాభా పెరుగుదలకు అనుగుణంగా సమాజంలో మార్పులు జరగాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాసు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లాకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారత్ ముందుందని, జనాభా పెరుగుదలకు అనుగుణంగా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కుటుంబ నియంత్రణ, తల్లి ఆరోగ్య సేవలు, విద్యను ప్రోత్సహించే కార్యక్రమాల ద్వారా గత కొన్ని దశాబ్దాలుగా సంతానోత్పత్తిని తగ్గించడంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. ఆరోగ్యకరమైన సమయం కాన్పుల మధ్య తల్లీబిడ్డల సంక్షేమం ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవ థీమ్ అని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణమోహన్, నర్సింహ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నాగర్‌కర్నూల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదనపు కలెక్టర్ సీతారామారావుకు ఆయన చాంబర్‌లో గురువారం విశ్రాంత ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ నగదు రహిత వైద్య చికిత్స అందించే ఈహెచ్‌ఎస్ పథకాన్ని సక్రమంగా అమలుపరచాలన్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్యం సత్వరమే అందించాలని కోరారు. కమిటేషన్ ద్వారా పొందిన మొత్తాన్ని 15 ఏళ్లలో రికవరీ చేస్తున్నారని, కానీ ప్రస్తుత వడ్డీ రేట్ల ప్రకారం పదేళ్ల 8 నెలలు చెల్లిస్తే సరిపోతుందని, ఆ విధంగా మినహాయింపును సరిచేయాలని కోరారు. ఈ విధానం ఇప్పటికే కేరళలో 12 ఏళ్లకు కుదించారని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లు ఏకమొత్తంలో చెల్లించాలని, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి సత్వరం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటశెట్టి, నాయకులు సురేందర్, సుధాకర్‌రెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నారాయణపేట రూరల్: గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని పళ్ళ ఎంబీచర్చి పక్కన కానుగ చెట్టుకు వ్యక్తి బుధవారం అర్ధరాత్రి తర్వాత ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం చుట్టుపక్కల వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించారు. అతని జేబును పరిశీలించగా రూ.20 తప్పా ఏలాంటి కాగితాలు, పత్రాలు దొరకలేదు. తెల్లచొక్క,, నీలం లుంగి ధరించి, శరీరంపై నల్లటి మచ్చలు ఉన్నాయి. లుంగి కొంత బాగం చించి దాంతోనే ఉరేసుకున్నట్లు గుర్తించారు. చొక్కపై టైలర్‌మార్క్ శ్రీమాన్ కేసీఎం అని ఇంగ్లిష్‌లో ఉంది. అతని ఆహార్యాన్ని బట్టి ముస్లిం అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

వాహనం అదుపుతప్పి వృద్ధుడి మృతి

అచ్చంపేట రూరల్: వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం మండలంలోని చెన్నారం గేటు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన నిమ్మల లింగయ్య(60) చేపల వలలు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. డిండి నుంచి అచ్చంపేటకు ద్విచక్రవాహనంపై వస్తుండగా మార్గమధ్యలో శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై చెన్నారం గేటు సమీపంలోని స్పీడు బ్రేకర్ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి అచ్చంపేట పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ రాములు, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో హుండీ చోరీ



గద్వాల క్రైం: ఆలయంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీ ఎత్తుకెళ్లిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. పట్టణంలోని బీరోలు రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మ దేవాలయంలో గురువారం తెల్లవారు జామున గుర్తు తెలియని దుండగులు గేటు తాళం ధ్వంసం చేశారు. ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీని అపహరించారు. రోజువారిలాగే దేవాలయం తెరిచేందుకు ఆలయ పూజరి వెళ్లగా అప్పటికే ఆలయం గేటు తెరిచి ఉంది. హుండీ కన్పించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ బీంకుమార్, సిబ్బంది పలు అంశాలపై గుడి పూజారిని అడిగి తెలుసుకున్నారు. దాదాపు రూ.70 వేల నగదును అపహరించినట్లు వివరించారు. డబ్బులు తీసుకొని ఖాళీ హుండీని ముళ్ల పొదల్లో విసిరేసి వెళ్లారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదే దేవాలయ ంలో ఇప్పటికే మూడు సార్లు విలువైన నగలు, నగ దును అపహరించారు. ఆలయ కమిటీ నిర్లక్ష్యం? లేదా తెలిసిన వ్యక్తుల చేతివాటం అయ్యి ఉండవచ్చని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలికపై ఓ వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు ఎస్‌ఐ జలంధర్ రెడ్డి తెలిపారు. గురువారం ఇంటి దగ్గర ఒంటరిగా ఉన్న బాలికపై అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు అత్యాచారానికి ఒడిగట్టాడని.. బాధితురాలి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

ఎన్టీఆర్ కళాశాలకు అటానమస్ హోదా



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం అటానమస్ హోదాను కల్పించింది. ఇందుకు సంబంధించిన ధ్రువపత్రాలను పాలమూరు యూనివర్సిటీ రిజిస్ట్రార్ మధుసూదన్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. అటానమస్ అర్హతా అన్ని ప్రమాణాలు, వసతులు కలిగిన కళాశాలలకు లభిస్తుందని, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సిలబస్, పరీక్షల నిర్వహణ తదితర అంశాల్లో వెసులుబాటు ఉంటుందన్నారు. కళాశాలకు అటానమస్ హోదా వచ్చేందుకు కృషి చేసిన రిజిస్ట్రార్‌ను ప్రిన్సిపాల్ తదితరులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి లావణ్య, వైస్ ప్రిన్సిపాల్ ముంతాజ్ జహాన్, శ్రీపాద్ గంగాధర్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంతంపై లోకాయుక్త విచారణ



గాంధీ నగర్ ట్రస్టు భూములను పరిశీలిస్తున్న లోకాయుక్త విచారణ బృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని గాంధీనగర్ ట్రస్టు, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ భూములు అన్యాక్రాంతానికి గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఇటీవల సామాజిక వేత్తలు అనీల్‌కుమార్, అయ్యన్న, ఎంబీ బాలకృష్ణ, సత్తయ్య లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గురువారం లోకాయుక్త బృందం విచారణ చేపట్టింది. మొదట తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు దారులతో మాట్లాడారు. అక్కడే ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, దేవాదాయశాఖ అధికారులతో వివరాలు సేకరించారు. భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం గాంధీనగర్ ట్రస్టు, వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సందర్శించారు. గాంధినగర్ ట్రస్టులో భూములను పరిశీలించారు. ఖాళీ స్థలం 8 ఎకరాల వరకు ఉందని.. దాన్ని కాపాడాలని ఫిర్యాదు దారులు కోరారు. పూర్తి విచారణ అనంతరం లోకాయుక్తకు నివేదిక అందిస్తామని విచారణ బృందం అధికారి ముత్యంరావు, డీఎస్పీ విద్యాసాగర్ తెలిపారు. ట్రస్టులో అనుమతి లేకుండా ప్రహరీ, ఇళ్ల నిర్మాణాలు ఎలా జరిగాయని, మీరేం చేస్తున్నారని కమిషనర్ రాజయ్యను వారు ప్రశ్నించారు. తాను నాలుగు నెలల క్రితమే బదిలీపై వచ్చానని కమిషనర్ తెలియజేయగా.. వారం రోజుల్లో పట్టణం మొత్తం తెలుసుకోవచ్చని హితవు పలికారు. అనుమతి లేని నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. అనంతరం అక్కడి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని విచారించారు. భూములకు సంబంధించి హద్దులు నిర్ణయించారా అని దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వీణాధరిని ప్రశ్నించగా.. లేదని సమాధానం ఇవ్వడంతో వారు అసంతృప్తి వ్యక్తంచేశారు. సర్వే పూర్తయి, హద్దులు పాతినట్లు దేవాదాయశాఖ కమిషనర్ లేఖ ఇచ్చారని తెలియజేయగా.. సమాధానం దాటవేశారు. వెంటనే హద్దులు నిర్ణయించాలని సూచించారు. అనంతరం విచారణ బృందం అధికారులు విలేకరులతో మాట్లాడుతూ.. ట్రస్టు భూములపై పూర్తి విచారణ చేస్తామన్నారు. ట్రస్టు కమిటీకి సమాచారం అందించి, వారితోనూ వివరాలు సేకరిస్తామన్నారు. మొత్తం 39 ఎకరాలకు గాను 8 ఎకరాలు మిగిలిందని, దీనిపై పూర్తి నివేదికను సిద్ధంచేసి లోకాయుక్తకు సమర్పిస్తామన్నారు. అదేవిధంగా వేంకటేశ్వరస్వామి ఆలయ భూములపైనా విచారణ జరిపి నివేదిక సిద్ధం చేస్తామన్నారు. లోకాయుక్త బృందం వెంట మహబూబ్‌నగర్ ఆర్డీఓ వినోద్, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరాజు, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ కృష్ణారావు ఉన్నారు.

సనాతన ధర్మం కోసం సైకిల్ యాత్ర

- సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్రకు యువకుడి శ్రీకారం



సైకిల్ యాత్ర చేస్తున్న రాజేందర్ శర్మ

అడ్డాకుల: సనాతన ధర్మం రక్షణ కోసం ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 50 వేల కిలోమీటర్ల సైకిల్ యాత్రకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు చెందిన 26 ఏళ్ల యువకుడు రాజేందర్ శర్మ శ్రీకారం చుట్టాడు. ఆరు నెలలుగా కొనసాగుతున్న సైకిల్ యాత్ర గురువారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లో 44వ నంబర్ జాతీయ రహదారిపై సాగింది. కొన్నేళ్ల కిందట ఢిల్లీ వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. హిందూ ధర్మం పట్ల ఆకర్షితుడై సైకిల్‌పై సంపూర్ణ భారత్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఈ ఏడాది ఫిబ్రవరి 5న సైకిల్‌పై ఢిల్లీ నుంచి అయోధ్యకు బయలు దేరాడు. మార్చి 13న అయోధ్యలో సంపూర్ణ భారత్ యాత్ర మొదలు పెట్టాడు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను దాటుకుని తెలంగాణలోకి ప్రవేశించాడు. 12 ద్వాదశ జ్యోతిర్లింగాలు, 51 శక్తి పీఠాలు, చార్‌ధామ్, పంచ కేదార్‌లలో పర్యటించి స్వస్థలానికి చేరతానని రాజేందర్ శర్మ తెలిపారు. ఏపీలో తిరుమలకు వెళ్లి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నట్లు చెప్పాడు. ప్రతి రోజు 70–80 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తానని, మార్గమధ్యలో సనాతన ధర్మంపై ప్రచారం చేస్తూ రాత్రివేళ దేవాలయాల వద్ద విశ్రాంతి తీసుకుంటానని వివరించాడు. ఇప్పటి వరకు సుమారు 8 వేల కిలోమీటర్ల దూరం యాత్ర చేసినట్లు పేర్కొన్నాడు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో పెన్షనర్ల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలను జేఏసీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందన్నారు. ఒకటో తేదీన పెన్షన్లు ఇవ్వడం తప్ప మరే సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. పెన్షనర్లకు బకాయి ఉన్న నాలుగు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత చికిత్స అందించాలన్నారు. ఈహెచ్‌ఎస్‌ను యూనివర్సిటీలు, జీహెచ్‌ఎంసీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు, మార్కెటింగ్ శాఖ పెన్షనర్లకు వర్తింపజేయాలని, ప్రతి జిల్లాలో అన్ని వసతులతో రెండు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన 5 శాతం ఐఆర్‌ను కనీసం 20 శాతానికి పెంచాలని, పీఆర్సీ రిపోర్టు వెంటనే అమలు చేయాలని, పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు, ప్రతి జిల్లాలో పెన్షనర్ల సంక్షేమ భవన్ నిర్మించాలన్నారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 15న రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు కలెక్టరేట్ల ఎదుట నిరసన ప్రదర్శన చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామదాసు, కార్యదర్శి కిష్టయ్య, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సీఎం రంగంలోకి దిగినా ఓడించలేకపోయారు'



దేవరకద్ర కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

దేవరకద్ర/ జడ్చర్ల టౌన్: స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి రంగంలోకి దిగినా పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓడించలేకపోయారని ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం దేవరకద్ర, జడ్చర్లలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ కుట్రలు కుతంత్రాలు పన్నినా వాటిని పటాపంచలు చేస్తూ నా గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానన్నారు. కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడకుండా అభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. నిన్నటి వరకు ఎన్నికల్లో ఏం చేసినా ఇప్పుడు అందరి లక్ష్యం పాలమూరు అభివృద్ధే కావాలన్నారు. చేతనైతే సహాయం చేయాలని, లేకపోతే ఊరుకోవాలని హితవు పలికారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి కేసీఆర్ నెట్టివేస్తే.. హామీలు నెరవేరుస్తున్నామని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాతాళంలోకి తొక్కుతుందని ఆరోపించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభివృద్ధికి పాటుపడతానని, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. దేవరకద్ర ప్రజలు రైల్వే ఓవర్ బ్రిడ్జితో పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు అండర్‌పాస్ నిర్మాణం చేపడతామని భరోసా ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు పద్మజారెడ్డి, ఎగ్గని నర్సింహులు, యజ్ఞభూపాల్‌రెడ్డి, నారాయణరెడ్డి, కృష్ణంరాజు, పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణయ్య, తిరుపతి, బాలవర్ధన్‌గౌడ్, బాలకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, సాహితిరెడ్డి పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల హుండీ ఆదాయం రూ.58.66 లక్షలు



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఉభయ ఆలయాల 110 రోజుల హుండీని గ్రేడ్–1 అధికారి మదనేశ్వర్ రెడ్డి పర్యవేక్షణలో లెక్కించగా రూ.58.66 లక్షల ఆదాయం సమకూర్చినట్లు దేవాలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు 170 మంది లెక్కింపులో పాల్గొన్నట్లు వివరించారు. అమ్మవారి ఆలయ హుండీలో రూ.49,12,941.. స్వామి వారి ఆలయ హుండీలో రూ.9,37,134 ఆదాయం వచ్చినట్లు చెప్పారు. అలాగే అన్నదాన సత్రం ద్వారా రూ.16,548 ఆదాయం వచ్చిందన్నారు. వీటితో పాటు 3 అమెరికన్ డాలర్లు, 5 ఆస్ట్రేలియా డాలర్లు, 5 దినార్స్, 10 సింగపూర్ డాలర్లు, కెనడా డాలర్లు 2 వచ్చాయన్నారు. అలాగే 33 గ్రాముల మిశ్రమ బంగారు, 344 గ్రాముల మిశ్రమ వెండి ఉందని చెప్పారు. మొత్తాన్ని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆలయంలో శిక్షణ కలెక్టర్లు

అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను శిక్షణ కలెక్టర్లు ఎస్.ఉమా హరినాథ్, అజ్మీర సంకేత్‌కుమార్, గరిమా నారుల, అభిగ్నియాన్ మాల్వియా, అజయ్‌యాదవ్, మ్రినాల్ శ్రేష్ఠ గురువారం దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణ అధికారి పురేందర్‌కుమార్ స్వాగతం పలికారు. ఉభయ ఆలయాలను దర్శించుకుని ఆలయ చరిత్రను, ప్రాంత విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహశీల్దార్ మంజుల వచ్చారు.

తమ్ముడినని చెప్పి దందాలు చేస్తే చర్యలు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హెచ్చరిక

జడ్చర్ల/ జడ్చర్ల టౌన్: పోలేపల్లి ఫార్మ సెజ్‌లో నా తమ్ముడినని చెప్పుకొని కొందరు వ్యక్తులు దందాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. తప్పుడు పనులకు పాల్పడేవారు ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. ఫార్మ సెజ్‌లో తన తమ్ముడినని చెప్పుకొని దందాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని తప్పుడు పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటంతోపాటు కేసు నమోదు చేయిస్తానని చెప్పారు. ఎమ్మెల్యే చేసిన ప్రకటన సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. తమ్ముడినని చెప్పుకొంటూ దందాలకు పాల్పడుతున్న వారు ఎవరనే చర్చ సాగింది. అవినీతి, అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ కార్యకర్తలైనా ఉపేక్షించేది లేదని పలుమార్లు ప్రకటించిన ఎమ్మెల్యే అదే క్రమంలో తమ్ముడినని చెప్పుకునే వారికి ప్రకటన ద్వారా హెచ్చరికలు జారి చేయటం చర్చనీయాంశంగా మారింది. కాగా ఇటీవల జడ్చర్లలో సైతం ఎమ్మెల్యే తమ్ముళ్లుగా ఒకరిద్దరు చెలామణి అవుతూ సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల టోర్నీ

- విజేత వరంగల్ జట్టు
- ట్రోఫీలు అందజేసిన ఎస్ఈ



గెలుపొందిన క్రీడాకారులతో విద్యుత్‌శాఖ అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్స్ ఇంటర్‌సర్కిల్ బ్యాడ్మింటన్ పురుషుల చాంపియన్‌షిప్ టోర్నీ గురువారం ముగిసింది. టీమ్ ఈవెంట్ విభాగంలో వరంగల్ ఆపరేషన్ జట్టు ఒక సింగిల్స్, రెండు డబుల్స్ మ్యాచ్‌లను గెలిచి విజేతగా నిలిచింది. మెట్రోజోన్ జట్టు రెండోస్థానంలో, కరీంనగర్ ఆపరేషన్ జట్టు మూడోస్థానంలో నిలిచాయి. సింగిల్స్ విభాగంలో దినేష్–విద్యుత్‌సౌధ (ప్రథమ), ప్రవీణ్–కార్పొరేట్ కార్యాలయం (ద్వితీయ), క్రిష్ణకాంత్–నిజామాబాద్ ఆపరేషన్ (తృతీయ), డబుల్స్ విభాగంలో క్రిష్ణకాంత్–శివతేజ (నిజామాబాద్ ఆపరేషన్), దినేష్- ప్రవీణ్ (విద్యుత్ సౌధ), హరీష్- సాగర్ (వరంగల్ ఆపరేషన్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు దక్కించుకున్నారు. టోర్నీలో ఉత్తమ క్రీడాకారుడిగా రామ్‌కుమార్ (విద్యుత్ సౌధ) నిలిచారు.

జాతీయస్థాయిలో రాణించాలి

జాతీయస్థాయి విద్యుత్ ఉద్యోగుల పోటీల్లో పాల్గొనే తెలంగాణ ఉద్యోగులు ప్రతిభచాటి జాతీయ స్థాయిలో రాణించాలని ఓఎంసీ ట్రాన్స్‌కో ఎస్ఈ డీ వాసుదేవరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విన్నర్, రన్నరప్, థర్డ్‌ప్లేస్ జట్లకు, క్రీడాకారులకు ట్రోఫీలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. ఇలాంటి క్రీడాటోర్నీలు విద్యుత్ ఉద్యోగుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో మెరుగైన శిక్షణ తీసుకొని జాతీయస్థాయి పోటీలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎస్ఈ (ఆపరేషన్) మాధవరెడ్డి, డీఈ రమణామూర్తి, ఈఈ ప్రకాశ్, ఏడీఈ టెక్నికల్ హన్మంతు, ఏఓ నాయుడు, టీజీ ట్రాన్స్‌కో స్పోర్ట్స్ అధికారి జగన్నాథ్, రిటైర్డ్ ఎస్ఈలు మూర్తి, జైరాజ్, ట్రాన్స్‌కో మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

– ఓఎంసీ ఎస్ఈ వాసుదేవరావు

గోమాతకు కన్నీటి వీడ్కోలు



కన్నబిడ్డలా నిత్యం తనతో ఉంటూ.. కాడెద్దులా వ్యవసాయంలో అండగా ఉన్న గోమాత విగత జీవిగా మారడంతో ఓ రైతన్న బోరున విలపించాడు. సంప్రదాయ బద్ధంగా అంతిమ సంస్కారం నిర్వహించి గోమాత రుణం తీర్చుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామానికి చెందిన రైతు నర్సింహులు వ్యవసాయంతో పాటు పాడి పశువులను పోషిస్తున్నాడు. అందులో ఓ ఆవు కన్నబిడ్డలా ఉండేది. నిత్యం పొలంలో రైతుకు తోడుగా కాడెద్దు వలే పని చేసేది. బుధవారం రాత్రి ఆవు అకస్మాత్తుగా అనారోగ్యంతో మృతి చెందింది. దీన్ని తట్టుకోలేని ఆ రైతు.. గుండెలు బాదుకుంటూ రోదించాడు. ఆవుపై పడి 'నన్ను విడిచి వెళ్లిపోతున్నావా.. ఇన్ని రోజులు నీతో కలిసి ఉన్నా.. ఇక నాకు ఎవరు తోడు'.. అంటూ కన్నీరు పెట్టుకున్నాడు. తన పొలంలోనే సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాగా, మృతిచెందిన ఆవుకు 8 నెలల దూడ ఉన్నట్లు తెలిపారు.

– నారాయణపేట రూరల్

జీవితంలో ఒడిదుడుకులు సహజం

- తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డా. నీరజ ప్రభాకర్



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో వైస్ చాన్స్‌లర్ డా. నీరజ ప్రభాకర్

కొత్తకోట రూరల్: జీవితంలో ఒడిదుడుకులు సహజమని.. వాటిని తట్టుకొని నిలబడినప్పుడే విజయానికి చేరువవుతారని, మంచి వ్యక్తిత్వం, కష్టపడేతత్వం విజయానికి దగ్గర చేస్తాయని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డా. నీరజ ప్రభాకర్ అన్నారు. గురువారం పెద్దమందడి మండలం మోజర్ల సమీపంలో ఉన్న ఉద్యాన కళాశాలలో నిర్వహించిన 15వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మానవత్వం, మంచితనం, పనిచేసే లక్షణాలతో ముందుకు సాగాలన్నారు. 2047 నాటికి అమృత్ కాల్ మొదలవుతుందని, అప్పటికి దేశ ఉద్యాన ఉత్పత్తులు 777 మిలియన్ టన్నుల మోతాదు అవుతుందన్నారు. ప్రస్తుతం 350 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే ఉందని.. ఇందుకు ఉత్పాదకత పెంచాల్సిన అవసరం ఉద్యాన నిపుణుల ముందున్న అతిపెద్ద సవాల్ అన్నారు. ఉద్యాన సాగులో రూ.ఒకటి పెట్టుబడి పెడితే రూ.3 లాభం ఉంటుందని.. రైతులు, చదువుకున్న యువత ఉద్యాన సాగుకు మొగ్గుచూపాలని సూచించారు. ఉద్యాన అనుకూల పరిశ్రమలకు భవిష్యత్ ఉందని.. విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం అనుకూల పరిశ్రమల ఏర్పాటుకు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటును అందిస్తుందని చెప్పారు. విద్యార్థులు చైతన్యం కాకపోతే జీవితంలో అన్ని కోల్పోయిన వారు అవుతారన్నారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం 2023–24 ఉద్యాన కళాశాల వార్షిక ప్రగతిని కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య చదివి వినిపించారు. సాంస్కృతిక, క్రీడలు, వైజ్ఞానిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను వైస్ చాన్స్‌లర్ నీరజ ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో ఆఫీసర్ ఆఫ్ స్టూడెంట్ అంపేర్ బి.రాజశేఖర్, ఓఎం డా. సహనాజ్, డా. ఆర్.పూర్ణిమమిశ్ర, డా. జె.శ్రీనివాస్, డా. పి.గౌతమి, డా. జి.విద్య, బేబిరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ధన్వంతరి హోమాలతో సంపూర్ణ ఆరోగ్యం

- శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి
- కందనూలులో కొనసాగుతున్న విశ్వశాంతి మహాయాగ మహోత్సవం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్: ప్రకృతి ఆరోగ్యం సంపూర్ణ ఆయుష్ ఆరోగ్య ప్రాప్తికి ధన్వంతరి హోమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజి అన్నారు. కందనూలులోని హోంనగర్‌కాలనీలో శ్రీకృష్ణ కాలచక్రం అయుత చండీ, అతి రుద్రం, శ్రీసీతారామ సామ్రాజ్య పట్టాభిషేకం 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవంలో భాగంగా యాగశాల కార్యక్రమాలను బ్రాహ్మణులు శాస్త్ర ప్రకారం నిర్వహించారు. పదోరోజు గురువారం ఉదయం గోపూజ యాగశాల ప్రదక్షిణ మొదలు అత్యంత వైభవంగా వేద హోమాలు, చండీహోమాలు, రుద్రహోమాలు, రామాయణం భాగవత సుందరకాండ చతుర్వేద హోమాలు, సామవేద యజుర్వేద, అదర్వణ, వేద రుగ్వేద, రుత్వికులు వేద మూర్తులైన బ్రాహ్మణులతో వేద మంత్రోచ్చరణాల మధ్య వైభవంగా కొనసాగాయి. సమాజంలో ఆర్థిక అభివృద్ధికి జ్ఞానంతో కూడిన ధనప్రాప్తికి యక్షరాజు కుబేరుడిని విశేషమైన బీజ మంత్రాలతో హవన, హోమ కార్యక్రమం భక్తులచే ఆచరించారు. అలాగే ఆయుష్షు అభివృద్ధికి ధన్వంతరి అవతారాన్ని ఉద్దేశించి మహిమాన్వితమైన మంత్రాలతో హోమాలు చేశారు. అలాగే సంతాన ప్రాప్తికి పుత్ర కామేష్టి హోమాలు, లోక శ్రేయస్సు, భారత భూమి ధర్మ పరిపాలన, విశ్వశాంతి, వాతావరణం ప్రకృతి అనుకూలత కోసం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణులు భక్తులందరికీ వేద ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. ఈ ప్రాంత భక్తులు హోమయాగల నిర్వహణకు ద్రవ్య వస్తు ధన రూపేనా సహకరించాలన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం ఉదయం చండీ సప్తశతీ హోమాలు, మహాలక్ష్మి, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు శ్రీ చక్ర అర్చన, చండీ అమ్మవారికి పంచామృత అభిషేక సహిత లక్ష కుంకుమార్చన మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు.